# లంకెల బిందెలు

సాయంత్రం అయ్యేసరికి అందరు తలంట్లు పోసుకోవటం అయింది. అందరికీ క్రొత్తబట్టలు, గుమ్మాలకు పచ్చటి పసుపు ఇంట్లో అందమైన ముగ్గులు, ఇంట్లోవాళ్ళ సందడి, హడావిడి చాలవింతగావుంది.

"ఇదిగో! శారదా! ఆపళ్ళెమిలా పట్రా!" అన్నాడు శ్రీనివాసు.

శారద మాట్లాడకుండాపోయి గ్లాసులబల్ల మీదవున్న చెంబు కాస్తా పట్టుకొచ్చింది.

శ్రీనివాసు నవ్వుతూ "అరె! అదికాదు; ఫలహారప్పళ్లెంపట్రమ్మంటే..." అన్నాడు

ఆమె తనలో తానే నవ్వుకుంది తను యివ్వాళ యింత పరాగ్గా వున్నందుకు.

అయినా సమర్థించుకుంటూ "కొబ్బరి కాయ నీళ్లు పట్టటానికిలెండి. మీరంతా... మరీను" అంది సిగ్గుతో.

"కాదులే! తెలుస్తూందిగా. మనసంతా రాబోయే లక్ష్మిచుట్టు తిరుగుతుంది. అందుకే యింతపరాకు," అన్నాడు శ్రీనివాసు.

"అదేమీ కాదులెండి" అంది నవ్వుతూ.

నిజానికి శ్రీనివాసు అన్నమాట అబద్ధమేమీకాదు. ఎన్నాళ్లనుంచో ఆ యింట్లో లంకెలబిందెలున్నాయని ప్రతీతి. రాత్రుళ్లు ఘల్లుఘల్లుమని ధ్వని వినిపిస్తుందిట. ఈ సంగతి శ్రీనివాసుబామ్మ చుట్టుప్రక్కల వాళ్లతో చాలసార్లు చెప్పింది. కొందరు దయ్యమంటారు. కొందరు అంతా వుత్తదే నంటారు. ఏది ఏమైనా శ్రీనివాసుబామ్మ మాత్రం అవి లంకెలబిందెలేనని ఖచ్చితంగా చెప్పేది.

అదేమని ఎవరైనా అంటే భారతం అంత పూర్వగాథ చెప్తుంది.

"మొఘలాయిలు భారతదేశం ఏలే సమయంలో ఒక గొప్ప మార్వాడీ ఈ వూళ్ళో ఈ స్థలంలో నివసించి వ్యాపారం జేస్తువుండేవాట్ట. వాడు చాల బంగారం గడించాట్ట. అయితే అప్పుడు తురకలవలన క్షణక్షణం భయంగా వుండేదట. అందువలన మార్వాడి తన బంగారు మొహిరీలను రెండు రాగి కొగులకు ఎత్తించి ఈ స్థలంలో ఎక్కడో పాతేడట. తరువాత చనిపోయాడు," అని యిక్కడి లంకెలబిందెల విషయం ఎత్తితే ఈ గాథతో ప్రారంభించేది.

కర్మంజాలక "మరి ఇంతకాలం వాటిని ఎందుకుదక్కించుకోలేకపోయారు?అని ఎవరైనా అడిగితే—

"అడిగావూ? తీగలాగితే డొంక కదులుతుంది. కూర్చోమరి చెప్తా,"అని మొదలు పెడుతుంది కొండవీటి చాంతాడులాగ. "పనుంది మళ్లీవస్తా," అనో "తలనొప్పిగా వుంది, రేవు చెప్పదువులే,"అనో వినకుండా తప్పుకుపోవటం ఎంగుకైనా మంచిది.

అయితే ఆమెచెప్పే విషయంయొక్క సారాంశమిది. ఇప్పటికి మూడుతరాలనుండి ఆ లంకెలబిందెలకోసం పూజలు పునస్కారాలు చేయిస్తున్నారు. కాని ఆ మూడు తరాల్లో ఎవరికీ అనుభవించే అదృష్టం లేక పోవటంవలన వాటిని దక్కించుకోలేక పోయారు.

ఇప్పుడు శ్రీనివాసు తరం. శ్రీనివాసుకు నమ్మకం లేకపోయినా బామ్మపోరు పడలేక ఏదో ఆమెకోసం ఈ వేళ ఈకర్మకాండంతా చేయాల్సివచ్చింది.

## "సాతులూరి"

"ఒరే! శీనూ! ఇంకా అవలేదట్రా! వెధవ ఫలహారం ఎంతసేపు! ఛీ! ఛీ! ఈ కాలపువాళ్లంతాయింతే...కానివ్వరా!... ఏమిట్రా నువ్వు?" అంది బామ్మ.

"చూడు బామ్మా! శారద ఏంజేస్తుందో! నేను ఫలహారం జేస్తుంటే......

"అయ్యో! నేనేం చేశానండి! ఇది మరీ బాగుంది. నా పని నే చేసుకొంటుంటే మీరేనాయె నన్ను పిలిచింది," అంది శారద.

"సరేపోయె, కానియ్యండ్రా! సరసాలకు సమయంలేదూ? ముహూర్తం దగ్గర పడుతుంది మళ్లీ... ఆయన వచ్చేటైంకూడా కావస్తుంది... ఇలాగైతే ఎలాగేపిల్లా! పోయి ఆ వంటపని కాస్తాకూడా కానీయి" అని బామ్మ లోనికి వెళ్లింది.

శారదవంక చూచి శ్రీనివాసు కనుబొమ ఎగరవేశాడు వెక్కిరింపుగా. శారద పవిట నడుంకు బిగించి శ్రీనివాసును చూచి మూతి త్రిప్పి వంటగదివేపు వెళ్లింది.

అవతల బామ్మ ఎవరినో కేకలువేయటం వినిపించి శ్రీనివాసు ఆమె రానేవస్తుందని తొందరగా కొబ్బరిముక్కలు తరుగుతూ చెయి కోసుకొన్నాడు.

"అబ్బా! యీ ముసలివాళ్ళంతా యింతే వెధవగోలా వాళ్లు." అనుకొన్నాడు.

"ఏంరా! ఇంకా కాలా?" అంది బామ్మ యింట్లోనుండి. "అయిపోయింది. వస్తున్నా" అంటూ శ్రీనివాసు పని పూర్తిజేసి లేచాడు.

చీకటిపడింది. అది శీతాకాలపు తొలి రోజులు అవటమూలానేమో మబ్బులుపట్టి అంధకారంగావుంది. వర్షంవచ్చే సూచనలు కన్పిస్తున్నాయి.

"శీనూ! ఇంకా ఆయనరాలేదు. వర్షం వచ్చేలావుంది. మరి ఆయనవస్తాడో రాడో! ఇవ్వాళ పనంతా వ్యర్థమవుతుంది" అంది బామ్మ కొంచెం విచారం సూచిస్తూ.

"ఇదిగో నే! ఆయన రానేవస్తున్నాడు" అన్నాడు శ్రీనివాసు.

"నీకు నిండా నూరేళ్లాయుస్సు. ఇప్పుడే నీమాట అంటున్నాం. అంతలో నువు రానే వచ్చావు" బామ్మ ఆనందంతో అంది.

"అంతా పూర్తిజేశారా మామ్మగారూ"? అన్నాడు భూతాల పోతరాజు.

"అంతా అవటమేమిటబ్బాయి! నువు రావటమే తరువాయి అనుకొంటుంటేను" అని బామ్మంది.

"అయ్యయ్యో! రాకుండా యెలా ఉంటానండీ!" అన్నాడు పోతరాజు.

ఇవ్వాళ పూజకోసం తూర్పుప్రక్కగది కేటాయించారు. ఆ గదంతా చక్కగా అలంకరించారు. అందులో లక్ష్మీదేవిని ప్రతిష్ఠించారు. చక్కనిపూలు చుట్టు పోశారు. పూజ ప్రారంభమైంది. అంతా కూర్చున్నారు.

బయట వాన ప్రారంభమైంది. ఘోరుమనే గాలి, సన్నని చినుకులల్లా పోయి పెద్ద వానగా తయారయింది.

"అబ్బా! వెధవ్వాన, సమయానికే తయారైంది" అంది బామ్మ విసుగ్గా.

పోతరాజు అందుకొని "అలా అనకండి. ఇదే మంచిసమయం. మునుపు మూడేళ్లక్రితం మన ప్రక్కవూరు సుబ్బిసెట్టిగారి యింటి దగ్గర బిందెల పూజ చేస్తూంటే యిలాగే వాన. ఎలా జరిగిందనుకొన్నారూ? అదంతా పెద్ద కథలెండి" అన్నాడు పోతరాజు.



కలోనియల్ కాలానికి చెందిన అమెరికన్ చిత్రకారుడు జాన్‌సింగిల్టన్ కాప్లే రచించిన రూపచిత్రం.

# ★ లంకెల బిందెలు ★

"ఏమి జరిగిందేమిటి?" అంది శారద ఆత్రుతగా.

"చాలకాలం క్రితంనుండి వాళ్ళయింట్లో మీయింట్లోలాగే కనకధ్వని వినిపిస్తోందట. కొన్నాళ్ళ తరువాత వాళ్ళ ముసలమ్మకు స్వప్నంలో 'నేనురానా? నేనురానా?' అని ఎవరో పిలుస్తున్నట్లు వినిపించిందట. వాళ్ళు నన్ను పిలిపించి పూజ చేయించారు. ఏం చెప్పనండీ, నాంచారమ్మగారూ! ధన ధనమని బిందెలు గుమ్మంలో వచ్చి ఆగినై. ఆరోజు యిదే సమయం. వాన, ఈదురు గాలి, కటికచీకటి," అని చేతులూ కళ్లు తిప్పుతూ చెప్పాడు పోతరాజు.

"ఇదంతా నిజమేనా?" అన్నాడు శ్రీనివాసు ఆశ్చర్యంగా.

"మరేమిటనుకొన్నారు? అబద్ధం చెప్పే ఖర్మ నాకేంపట్టింది? కళ్లారా చూసింది, పూజచేసింది, నేను" అన్నాడు పోతరాజు.

"అలా చెప్పబాబు! మావాడికి ఇలాంటి వంటే గిట్టవ్" అంది బామ్మ.

కబుర్లతో చాల ప్రొద్దుపోయింది. బయిటిగాలి వాన మోతాదు కాస్త ఎక్కువవుతోందే గాని తగ్గేసూచన మాత్రం కన్పించటంలేదు. శారద శ్రీనివాసు కునికిపాట్లు పడుతున్నారు. బామ్మమాత్రం కన్నార్పకుండా గుమ్మంవైపే చూస్తోంది.

కనీసం ఇప్పటికి అరడజను కొబ్బరికాయలు కొట్టాడు. ఏవో మంత్రాలు వల్లె వేస్తున్నాడు పోతరాజు.

శ్రీనివాసుకు నిద్ర ఆగటంలేదు.

"బామ్మా! నేను పడుకుంటాను" అన్నాడు.

"ఏవిట్రా! మరీ చిన్నపిల్లాడిలాగ... అంతగా ఆగలేకపోతే పోయి పడుకో" అంది బామ్మ.

శ్రీనివాసు తూలుకొంటూ తూలుకొంటూ బయటికి పోబోయాడు.

"అరెరె! అటుగాదు. పడమటి వేపు తలుపుతీసుకొని పోయిరా. ఇటుపోకూడదు" అంది బామ్మ.

శ్రీనివాసు విసుక్కున్నాడు. పడమటి వైపుపోయాడు. బయట చలిగాలి కొడుతుంది. చలిగాలి తగలడంతో మగతంతా విడిపోయింది. గోడప్రక్కనే తలుపుదగ్గరగా బిందె కాలుకు తగిలి కొంత సందడిచేసింది. దాంతో మగత పూర్తిగా విడిపోయింది. కళ్లు యింత జేసుకు చూశాడు. అవి లంకెలబిందెలు. కెవ్వున కేకవేసి ఒక్క గంతులో ఇంట్లో పడ్డాడు.

"బామ్మా! బామ్మా! లంకెలబిందెలు! లంకెలబిందెలు!" అని నోటికొద్దీ అరిచాడు. కునుకుతున్న శారద వులిక్కిపడింది. బామ్మ గుడ్లు తేలవేసింది. కాసేపటివరకు నోట మాట రాలేదు.

"నేను చెప్పలేదూ? మన పూజంటే ఏంటనుకొన్నారూ?" అన్నాడు పోతరాజు గర్వం, వుత్సాహం వెల్లుబుకుతున్నట్లు.

అందరు లైటు తీసుకొని గుమ్మంలో కెళ్లారు.

"అవి లంకెలబిందెలే! బిందెలే!" అని అరిచింది బామ్మ బిందెలపై బాగా బురద కొట్టుకొంది. గడ్డితాడుతో రెండు బిగించబడివున్నాయి.

పోతరాజు అమాంతం కోడిమెడ నులిమి రక్తం చుట్టు పారపోసి, దిగదుడిచి అవతల విసిరాడు. శారదను రెండు చేతులెత్తి దండం పెట్టమన్నారు. దండం పెట్టింది. అర్ధశేరు నవటాకు సాంబ్రాణి చితకగొట్టి గుప్పున పొగవేశారు.

శ్రీలక్ష్మీ! కటాక్షించు" అని దండం పెట్టింది బామ్మ.

"దండంపెట్టరా మొద్దా! అలా చూస్తావేం" అంది శ్రీనివాసును బామ్మ.

మాటవినగానే వంగి దండం పెట్టాడు.

తీరా చూస్తే వాటిల్లో ఏమీలేదు. అంతా ఆశ్చర్యపోయారు.

"ఏమిటి? వాకాలు తగిలినప్పుడు చాల బరువుగా వున్నాయి" అన్నాడు శ్రీనివాసు



ఉజ్‌బెక్ జానపద కళోత్సవాలు మాస్కోలోని పుష్కిన్ లలితకళా ప్రదర్శనశాలలో జరిగిన సందర్భంలో హాజరైన ఉజ్‌బెక్ కళాకారుడు శ్రీ యస్. అబ్దుల్లాఏవ్, భారతీయ పత్రికా విలేఖరులు శ్రీ వీరేంద్రకుమార్ శుక్లా, శ్రీ అమ్జాద్ యూసుఫ్‌ఖాన్.

"అదృష్టహీనులంటుకొంటే పాములు, తేళ్ళు, ఏమీ లేకుండా పోవటాలు జరుగుతాయి" అన్నాడు పోతరాజు.

శ్రీలక్ష్మీ! కటాక్షించు. నీ దాసులం మమ్మల్ని అన్యాయంజేయకు తల్లీ! నువు కన్నుతెంచి కటాక్షిస్తే నీకు వెయ్యి కొబ్బరికాయలు, బంగారుకాసులతో పూజ చేయిస్తాను" అని మొక్కుకుంది బామ్మ.

"శారదగారండీ! ఈసారి మీరు తాకండి" అన్నాడు పోతరాజు. శారద భయపడింది.

"ఏంభయం లేదండీ! నేనుండగా ఎందుకు భయపడతారు" అన్నాడు పోతరాజు.

శారద తాకింది. ఏమీ లాభం లేకపోయింది.

బామ్మ, పోతరాజు, శ్రీనివాసు వరసగా అందరూ తాకేరు. మార్పేమీలేదు. అలానే వున్నాయి.

"మీ పాలేరాడు లేడండీ!" అన్నాడు పోతరాజు.

"ఏమో, వాడు యింటిదగ్గర్నుండి వచ్చాడో రాలేదో యీ వానలో. నేనూ! పాకలో వున్నాడేమో చూడు" అంది బామ్మ ఏదో ఆశ ఆత్రుత వుడికిస్తున్నట్టు. గాట్లో ముసుగువేసుకు పడుకున్నవాడ్ని తట్టి "గోపిగా! గోపిగా!" అని లేపాడు.

వాడు లేచి కళ్ళు నులుముకొంటూ "నేను గోపిగాణ్ని గాదు బాబు! బెరాపట్టం చిన బ్బాయిగోరి పాలేర్నండీ!" అన్నాడు వాడు.

"అయితే యిక్కడి కెందుకొచ్చావు యింత రాత్రిలో" అన్నాడు శ్రీనివాసు.

"మొన్న పదిరోజులకితం మా దొరగోరి కూతురి పెళ్లి జరిగిందిగదండీ..."

"అయితే...?"

"అందుకని తమ రింటికాడ కెందు కొంగులు పట్టించుకెళ్లారంట. అవి యిచ్చి రామని పంపారండి. నేను బయలుదేరేతలికి ఏమీలేదు. నన్ను అట్టా కోసుదూరానిచ్చి వాన లంకించుకొంది. నానా యాతనపడి వచ్చాను. సూడండి! వళ్ళంతా బురదే! తీరా వచ్చేసరికి తమురు పడుకున్నారు. ఎంత పిలిచినా పలకరే! ఇక యిసిగెత్తి బిందెలా గోడ ప్రక్కన పెట్టి చలికాగలేక గొడ్లగాట్లో నడుంవాల్చా" అని నిట్టూరుస్తూ చెప్పేడు.

శ్రీనివాసు నవ్వాపుకోలేకపోయాడు. శారద సిగ్గుపడింది తను ఎంతో ఆశతో దండం పెట్టినందుకు. బామ్మ బిక్కమొగ మేసింది. పోతరాజు తేలుకుట్టిన దొంగలా చీకట్లో జారుకున్నాడు. ★

డైరెక్టరు: ఏం సార్ మీ బ్రదర్ని ఎవర్నో తీసుకొస్తానన్నాడు. ఏ రోల్ కండీ?

ప్రొడ్యూసర్: అదే ఇంకా తేలలేదండీ. నటనకీ, ధాటీకీ రామారావు; కంఠానికి మాధవపెద్ది సత్యం; డాన్సుకి వెంపటిసత్యం. అసలు వాళ్లు ఈ మనిషిముందు ఎందుకూ పనికిరారు.

డైరెక్టరు: ఇంకేం. అయితే ఏదో ఓ పెద్ద వేషమే ఇవ్వొచ్చు.

ప్రొడ్యూసర్: ఇవ్వొచ్చుగాని ఆ మనిషి ఆడపిల్లండీ. అదొక్కటే చిక్కు.